ప్రజాశక్తి

ఆదివారం 26 జనవరి 2025

I

అల్లూరి సీతారామరాజు




## అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర చెల్లించాలి

**ప్రజాశక్తి -ముంచింగి పుట్టు:** మండల కేంద్రంలో నిర్వహిస్తున్న వారపు సంతల్లో దళారీ వ్యాపారస్తులు చేస్తున్న మోసాల అరికట్టి, ఆదివాసి గిరిజనులు పండించిన ప్రతి పంట ఉత్పత్తులను గిట్టుబాటు ధరకు గిరిజన సహకార సంస్థ కొనుగోలు చేయాలని ఆదివాసి గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ఎంఎం శీను డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు శనివారం మాట్లాడుతూ, కాఫీ కిలో రూ.500, మిరియాలు రూ.1000, పిక్కచింత పండు కిలో 50, కొండ చీపురు మొదటి రకానికి 60, రెండవ రకం 50తో కొనుగోలు చేసి ఆదివాసులకు గిట్టు బాటు ధరలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఆదివాసి గిరిజన ప్రాంతంలో అటవీ ఉత్పత్తులైన 24 రకాలకు గిట్టుబుటు ధరలు జిసిసి సంస్థ ప్రకటించాలని డిమాండ్ చేశారు. వారపు సంతల్లో దళారులు తూకాలలో మోసం చేస్తున్నారన్నారు. అధికారులు స్పందించి దళారుల మోసాలను అరికట్టాలని కోరారు.

# కార్పొరేట్లకు దోచిపెట్టే వ్యూహం

- రాష్ట్ర ప్రభుత్వ విధానాలు సమగ్రాభివృద్ధికి ప్రతిబంధకం
- సంస్కరణలతో పెరిగిన అసమానతలు
- 'ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధి - ప్రత్యామ్నాయ విధానాలు' సదస్సులో వక్తలు




సదస్సులో మాట్లాడుతున్న నారాయణరాజు, వేదికపై లోకనాథం, నర్సింగరావు, తులసీదాస్, సురేంద్ర తదితరులు

**ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో**

ఉత్తరాంధ్రలో వనరులను కార్పొరేట్లకు దోచిపెట్టే వ్యూహం ప్రస్తుతం నడుస్తోందని పలువురు వక్తలు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాలు సమగ్రాభివృద్ధికి ప్రతిబంధకంగా ఉన్నాయని విమర్శించారు. సంస్కరణల ప్రభావంతో నానాటికీ అసమానతలు పెరుగుతున్నాయన్నారు. శనివారం విశాఖలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో సిపిఎం విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం అధ్యక్షతన 'ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధి-ప్రత్యామ్నాయ విధానాలు' అన్న అంశంపై సదస్సు జరిగింది. నెల్లూరులో ఫిబ్రవరి 1 నుంచి 3 వరకూ జరుగనున్న సిపిఎం రాష్ట్ర మహాసభల నేపథ్యంలో ఈ సదస్సును ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ అభివృద్ధి వ్యూహమే రాష్ట్రంలోని ప్రాంతాల అభివృద్ధికి ప్రతిబంధకంగా ఉందని తెలిపారు. వనరులున్నా వాటిని కార్పొరేట్లకు దోచిపెట్టే వ్యూహం ప్రజల్లో ఆర్థిక అసమానతలను పెంచిందని అన్నారు. తొలుత విజన్ 2020 అన్న చంద్రబాబు రాష్ట్రంలో పేదరికాన్ని తగ్గించిందీ లేదు, ఉద్యోగాలు తెచ్చిందీ లేదని ఎద్దేవా చేశారు. ఉత్తరాంధ్రపై 1991 నాటి సంస్కరణల ప్రభావం పడిందని, గ్రామీణ ప్రాంత ప్రజలు జీవనావసరాలను నేటికీ తీర్చుకోలేని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారని అన్నారు.

ఇరిగేషన్ రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ యు.నారాయణ రాజు మాట్లాడుతూ సాగునీటి ప్రాజెక్టులపై నిర్లక్ష్యం తగదన్నారు. 1983లో విజయనగరం జిల్లాలో తాను ఇంజినీరుగా పనిచేసినప్పుడు జంఝావతి ప్రాజెక్టుకు రూ.7 కోట్లతో అంచనా వేయగా ఇప్పుడు రూ.250 కోట్ల అంచనాకు చేరిందన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో భూసేకరణకు సంబంధించిన రికార్డుల నిర్వహణే సరిగ్గా లేదని తెలిపారు. రాజకీయ నాయకుల అవగాహనా రాహిత్యం, సరిపడా నిధులను సకాలంలో ఖర్చు చేయకపోవడం, ప్రణాళికా లోపాలతో ఉత్తరాంధ్రలో రైతులకు మేలుచేసే పలు ప్రాజెక్టుల నిర్మాణంలో జాప్యం జరిగిందన్నారు. ఉత్తరాంధ్రకు జీవనాడి సుజల స్రవంతి అని, రూ.7 వేల కోట్ల అంచనాతో తయారై నేడు రూ.22 వేల కోట్లకు అది చేరిందని అన్నారు. విచిత్రమేమంటే గత బడ్జెట్‌లో కేవలం రూ.10 వేలు మాత్రమే కేటాయించారన్నారు. పోలవరం ఎనిమిది ప్యాకేజీలు టెండర్లు క్లియర్‌గా ఉంటే రాజకీయ ప్రభావంతో పై నుంచి ఒక్కరికే టెండరు ఇచ్చేలా ప్రభుత్వం చేయడం దారుణమన్నారు.

సభకు అధ్యక్షత వహించిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ అసమానతల్లేని అభివృద్ధి జరగాలని రెండేళ్ల క్రితమే సిపిఎం అభివృద్ధి ప్రణాళికలను రూపొందించిందన్నారు. చంద్రబాబు విజన్ -2047లో ప్రజల అభివృద్ధికి సంబంధించిన అంశాలేమీ లేవని తెలిపారు. ఆ విజన్ అమలైతే ఉత్తరాంధ్ర నాశనమవ్వడం ఖాయమన్నారు. బాబు దావోస్ వెళ్లి వెనక్కి వస్తూ.. భ్రమలు కల్పించే యత్నాలు చేస్తున్నారన్నారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ప్రాంత వనరులను దోచుకోడానికి 'విశాఖ నగరం' అభివృద్ధిని తరచూ తెరపైకి తెస్తున్నారని అన్నారు. అభివృద్ధి పేరుతో ప్రజల్లో భ్రమలు కల్పిస్తున్నారని పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల స్థానిక ప్రజాప్రతినిధులు ఈ ప్రాంత అభివృద్ధిపై ఏళ్ల తరబడి బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నారని అన్నారు. విశాఖ తీరంలో మత్స్యకారులు ఒకప్పుడు రెండు మూడు కిలోమీటర్లు వెళితే చేపలు దొరికేవని, నేడు 100 మైళ్ల వెళ్తున్నారని తెలిపారు. కాలుష్య కారక పరిశ్రమలతో సముద్రం కలుషితమైపోతోందన్నారు. అన్నీ ఉన్నా ఉత్తరాంధ్ర అభివృద్ధిలో వెనక్కి నెట్టబడుతోందని ఆవేదన చెందారు. కనీసం విభజన చట్టం అమలై ఉండి ఉంటే ఉత్తరాంధ్ర కాస్తయినా అభివృద్ధి జరిగి ఉండేదన్నారు. సదస్సులో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్, కె.సురేంద్ర, సీనియర్ నాయకులు సిహెచ్.నర్సింగరావు, ఎం.కృష్ణమూర్తి, ఉత్తరాంధ్ర జిల్లాల కార్యదర్శులు ఎం.జగ్గునాయుడు, జి.కోటేశ్వరరావు, టి.సూర్యనారాయణ, డి.గోవిందరావు, కె.గంగునాయుడు, విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ బి.గంగారావు, పద్మ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం

## బాలికలు చదువుపై దృష్టి పెట్టాలి

### - ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం

**ప్రజాశక్తి-రంపచోడవరం**

ఏజెన్సీలోని కిశోర బాలికలు చదువుపై దృష్టి పెట్టి ఉన్నతమైన ఉద్యోగాలు పొందాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్ట సింహాచలం పేర్కొన్నారు. రంపచోడవరం మండలం ఇర్లపల్లి గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవం (కిశోరి వికాసం) శనివారం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న పిఒ సింహాచలం మాట్లాడుతూ గతంలో పేదవారికి చదువుకునే అవకాశం ఉండేది కాదని, కాని నేడు ఉచిత భోజనం, వసతితో సహా ఉచిత విద్యను ప్రభుత్వాలు అందిస్తున్నాయని తెలిపారు. 18 ఏళ్లలోపు పెళ్లి చేసుకోవద్దని, అలా చేసుకుంటే శారీరకంగా అనేక ఇబ్బందులు పడతారని తెలిపారు. రంపచోడవరం సబ్ కలెక్టర్ కెఆర్.కల్పశ్రీ మాట్లాడుతూ బాలురుతో సమానంగా అన్ని రంగాల్లో బాలికలు ముందుండాలన్నారు. బాలికలకు, మహిళలకు రక్షణ కవచం లాగా చట్టాలు ఉన్నాయని చెప్పారు. బాలికలు మంచి చదువులు చదివిన తర్వాతే పెళ్లి చేసుకోవాలని సూచించారు. ఏజెన్సీలో టీనేజీ గర్భాలు నిర్మూలించే బాధ్యత మనందరిపై ఉందన్నారు. బాలికల 21 సంవత్సరాలు నిండకుండా తల్లిదండ్రులు పెళ్లి చేయాలని చూస్తే తిరస్కరించాలని సూచించారు. రంపచోడవరం సబ్ డివిజనల్ పోలీస్ అధికారి సాయి ప్రశాంత్ మాట్లాడుతూ బాలికలు కొంతమంది అబ్బాయిల మాటలు విని మోసపోవద్దని హితవుపలికారు. రంపచోడవరం గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయశాంతి మాట్లాడుతూ ప్రతి బాలిక డిగ్రీ ఆపై చదువులు చదివిన తర్వాతే పెళ్లిళ్లపై దృష్టి పెట్టాలన్నారు. అనంతరం ఈ పాఠశాలలో బాగా చదువుతున్న ముగ్గురు విద్యార్థులకు సర్టిఫికెట్లు భద్రపరుచుకునే ప్యాడ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఒ సంధ్యారాణి, ఎంపీడీవో యస్.శ్రీనివాసరావు దొర, హెచ్ఎం యస్.రాజేశ్వరి, పురోహితులు అద్దంకి వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# గణతంత్ర వేడుకలకు సర్వం సిద్ధం



ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

**ప్రజాశక్తి-పాడేరుటౌన్:** గణతంత్ర వేడుకలకు జిల్లా కేంద్రమైన పాడేరులోని తలారిసింగి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల గ్రౌండ్ ముస్తాబైంది. ఆదివారం కార్యక్రమాలు తిలకించేం దుకు వీక్షకులు కూర్చునేందుకు ప్రత్యేక షామియానాలు వేసి కుర్చీలు, సోఫాలు సిద్ధం చేశారు. ప్రదర్శనల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ వేడుకలలో ముఖ్యఅతిథిచే జాతీయ పతాకం ఆవిష్కరణ, పోలీసుల, విద్యార్థుల కవాతు మార్చ్ ఫాస్ట్, ప్రజలకు జిల్లా కలెక్టర్ సందేశం, పోలీసు జాగిలాల విన్యాసాలు, జిల్లా ప్రగతిని చాటే శకటాల ప్రదర్శన, ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు వంటి ఏర్పాట్లు చేశారు. ఉత్తమ ప్రదర్శన కనబరిచిన శకటాలకు కవాతు బృందాలకు జ్ఞాపికలను అందజేస్తారు. ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు పురస్కారాలు ప్రధానంతో పాటు వివిధ కార్యక్రమాలు నిర్దేశించిన సమయానికి జరిగేలా ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా ఉన్నతాధికారులు కూర్చునేందుకు ఏర్పాటు చేసిన స్టేజిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. గ్రౌండ్ లో ఏర్పాట్లన్నీ ఆకర్షనీయంగా తీర్చిదిద్దారు.



సిద్ధమైన సభా వేదిక



మాట్లాడుతున్న సిపిఎం నాయకులు పాయం సీతారామయ్య

## పెన్షన్ల వెరిఫికేషన్ ఏరియా ఆసుపత్రిలో నిర్వహించాలి

**ప్రజాశక్తి-కూనవరం**

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పింఛన్ల వెరిఫికేషన్ చింతూరు ఏరియా ఆసుపత్రిలో నిర్వహించాలని సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు, పాయం సీతారామయ్య డిమాండ్ చేశారు. శనివారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలను కుదించే చర్యలో భాగంగా గతంలో జారీ చేసిన వికలాంగ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం రంపచోడవరం పిలిపించడం దుర్మార్గమన్నారు. సుదూర ప్రాంతాలు నుండి కొండలు గుట్టలు దాటి 150 కిలో మీటర్లు దూరంలో ఉన్న రంపచోడవరం వికలాంగులు ఎలా వస్తారని ప్రశ్నించారు. నాలుగు మండలాల వికలాంగుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చింతూరు ఏరియా ఆసుపత్రిలో జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు తాలూరి శ్రీనివాసరావు, శాఖ కార్యదర్శి కొండా ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

### ఏకలవ్య పాఠశాలల్లో ప్రవేశానికి ఏజ్ కటాఫ్ డేట్ పెంచాలి

**ప్రజాశక్తి-దేవీపట్నం :** ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో ప్రవేశాలకు విద్యార్థుల వయస్సు 2025 ఆగస్టు 31 వరకు ఏజ్ కటాఫ్ డేట్ పెంచాలని ఆదివాసి జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈనెల 17వ తేదీన రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఆరో తరగతిలో ప్రవేశాలకు నోటిఫికేషన్ ప్రకటించారని, అందులో విద్యార్థుల వయసు 2025 మార్చి 31 నాటికి 10 నుండి 13 సంవత్సరాల లోపు ఉండాలని సూచించారని తెలిపారు. పైన పేర్కొన్న కటాఫ్ తేదీల వలన ఆదివాసీ గిరిజన విద్యార్థులు ఎక్కువ మంది అప్లై చేసుకోవటానికి అవకాశం కోల్పోతారని తెలిపారు. ఆదివాసీ గిరిజన విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని 2025 ఆగస్ట్ 31ని కటాఫ్ తేదీగా పెంచి నోటిఫికేషన్ ఇవ్వాలని కోరారు.

## కలెక్టర్ దినేష్ కుమార్‌కు అవార్డు ప్రదానం

**ప్రజాశక్తి-పాడేరు :** జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్‌కు 2024 సంవత్సరానికి బెస్ట్ ఎలెక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డ్‌ను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే. విజయానంద్ చేతుల మీదుగా తీసుకున్నారు. శనివారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన జాతీయ ఓటర్ల దినోత్సవం వేడుకలలో ఈ అవార్డును కలెక్టర్ తీసుకున్నారు. గత ఏడాది ఓటర్ల జాబితా తయారీలో, సమ్మరీ రివిజన్ లో విశేస కృషి చేసి ఓటర్ల జాబితా తయారీకి పలు సూచనలు, నూతన ఓటర్లను చేర్పించడం, అనర్హులను తొలగించడం, ఓటరు జాబితాలో అభ్యంతరాలను పరిష్కరించడం తదితర అంశాలను దృష్టిలో పెట్టుకుని ఆ అవార్డుకు కలెక్టర్ ఎంపికైన విషయం విదితమే.



పురస్కారాన్ని అందుకుంటున్న కలెక్టర్

కలెక్టర్‌తో పాటు జిల్లాలో మరో నలుగురు అధికారులు, సిబ్బంది కూడా బెస్ట్ ఎలెక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డును విజయవాడలో తీసుకున్నారు. అందులో గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక ఉప కలెక్టర్ వి.ఎస్. లోకేశ్వర్‌రావు, ఎఇఆర్‌ఓగా విధులు నిర్వర్తించిన రంపచోడవరం తహసిల్దార్ పి. రామకృష్ణ, పాడేరు పిఎస్ నంబర్ 153 బిఎల్‌ఓ వి. సౌందర్య, అరకు పిఎస్ నంబర్ 294 బిఎల్‌ఓ కె. సుదర్‌రావులు కూడా ప్రధాన కార్యదర్శి చేతుల మీదుగా అవార్డులు స్వీకరించారు.



ఆందోళన చేపడుతున్న కార్మికులు, సిఐటియు నాయకులు

## వేతనాలు చెల్లించాలి

### - మిడ్డే మీల్స్, శానిటరీ కార్మికుల ధర్నా

**ప్రజాశక్తి-హుకుంపేట:** మండలంలోని జీపీఎస్, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో పని చేస్తున్న కార్మికులకు వెంటనే జీతాలు చెల్లించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మండల కేంద్రం నుంచి ఎంఈఓ ఆఫీస్ వరకు ర్యాలీ చేపట్టి శనివారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంఈఓ సోమేలి చెల్లయ్యకు తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గిరిజన మహిళ సంఘం జిల్లా కార్యదర్శి సొంటేన హైమావతి మాట్లాడుతూ, 7 నెలల నుండి జీతాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.15 వేలకు పెంచాలని ఆమె డిమాండ్ చేశారు. గ్యాస్ కనెక్షన్లు వర్కర్లకు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు, గిరిజన సంఘం మండల కార్యదర్శి తాపుల కృష్ణారావు, ఎం డీ ఎం మండల అధ్యక్షురాలు వంతాల స్వప్న, సానిటరీ వర్కర్స్ కొర్ర మొత్తి, సావిత్రి, గౌరి, చింతా చిన్నమ్మి, కాకరి రాములమ్మ, మర్రి సత్యవతి, వంతాల మాధవి తదితరులు పాల్గొన్నారు.

# నెల రోజుల్లో పంప్డ స్టోరేజ్ ప్రాజెక్టు పనులు ప్రారంభం

### ఎపి జెన్కో హైడల్ డైరెక్టర్ సుజయ్‌కుమార్



రెగ్యులేటరీ డ్యామ్‌ను పరిశీలిస్తున్న సుజయ్‌కుమార్, ఇతర అధికారులు

**ప్రజాశక్తి-సీలేరు**

జికె.వీధి మండలం సీలేరు పార్వతీనగర్ వద్ద 1350 మెగావాట్ల సామర్థ్యం గల పంప్డ స్టోరేజ్ ప్రాజెక్టు నిర్మాణ పనులు నెల రోజుల్లో ప్రారంభం కానున్నాయని ఏపీ జెన్కో హైడల్ డైరెక్టర్ సుజయ్ కుమార్ వెల్లడించారు. హైడల్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం మొదటిసారిగా సీలేరు కాంప్లెక్స్‌లో శనివారం ఆయన విస్తృతంగా పర్యటించారు. ఏపీ జెన్కో అతిథి గృహంలో జెన్కో అధికారులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పంపు స్టోరేజ్ నిర్మాణానికి కావలసిన అనుమతులన్నీ మంజూరయ్యాయని, ఇంకా అటవీశాఖ అనుమతులు రావాల్సి ఉందని చెప్పారు. అవి రాగానే టెండర్లు దక్కించుకున్న మెఘా ఇంజనీరింగ్ కంపెనీ పనులు ప్రారంభించడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. ఫిబ్రవరి, మార్చి నాటికి రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని, ఎన్‌హెచ్‌పి భాగస్వామ్యంతో ఏపీ జెన్కో అనేక చోట్ల కొత్త ప్రాజెక్టులు చేపడుతుందని చెప్పారు. 5070 మెగావాట్లు సామర్థ్యం గల ప్రాజెక్టులు నిర్మించడానికి ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి ముందే 2027 ఫిబ్రవరి నాటికి పోలవరం ప్రాజెక్టు పనులు పూర్తి చేయడానికి కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. మొదటి దశలో రెండు యూనిట్లు 2026 నాటికి వినియోగంలోకి తీసుకొస్తామన్నారు.

ఆంధ్రా, ఒడిశా ఉమ్మడి నిర్వహణలో ఉన్న మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రం నిర్మించి 70 ఏళ్లు పైబడిన నేపథ్యంలో తరచూ యూనిట్లలో సాంకేతిక లోపాలు తలెత్తి విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. ఆధునికీకరణ చేయడానికి యూనిట్లో ఉన్న స్పేర్ పార్టులు బయట లభించకపోవడంతో పాత వాటినే రీ కండిషన్ చేసి అమర్చవలసి వస్తుందని, దీంతో తరచూ యూనిట్లు మరమ్మతులు గురవుతున్నాయని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులో యూనిట్లు ఆధునికీకరణ చేసి విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం పెంచేదిశగా ఆర్ఎల్ఏ స్టడీ నిర్వహిస్తున్నామని చెప్పారు. సీలేరు కాంప్లెక్స్ పరిధి పోల్లూరు జల విద్యుత్ కేంద్రంలో రెండో దశ ఐదు, ఆరు యూనిట్లు నిర్మాణ పనులు ఈ ఏడాది ఏప్రిల్ నాటికి పూర్తి కావలసి ఉండగా, సామాగ్రి రావడంలో జాప్యం జరుగుతుందని తెలిపారు.

అనంతరం హైడెల్ డైరెక్టర్ స్థానిక ఏపీ జెన్కో కాలనీ స్థితిగతులపై అధ్యయనం చేశారు. రెగ్యులేటరీ డ్యాముకు చేరుకొని గేట్లు పనితీరు పరిశీలించి అధికారులకు అడిగి తెలుసుకున్నారు. పార్వతీనగర్ వద్ద నూతనంగా నిర్మించబోయే పంపు స్టోరేజ్ ప్రాజెక్టు స్థల పరిశీలన చేశారు. ఈ కొత్త ప్రాజెక్టు నిర్మాణానికి వచ్చే ఇంజనీర్లు, సిబ్బందికి పూర్తిస్థాయి వసతులు ఉన్నాయా లేదా అని కింద స్థాయి ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో విజయవాడ విద్యుత్ సౌదా ఏపీ జెన్కో సీఈ కోటేశ్వరరావు, సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు, ఎస్ఇలు చంద్రశేఖర్ రెడ్డి. చిన్న కామేశ్వరరావు. క్వాలిటీ కంట్రోల్ ఎస్ఇ కనకదుర్గ, ఈఈలు వరప్రసాద్, రాజేంద్రప్రసాద్, శ్రీనివాసరెడ్డి, భాస్కర్‌రావు, ఏడిఇలు టి.అప్పలనాయుడు, దుర్గా శ్రీనివాస్, ఏఈఈ సిహెచ్ సురేష్, ఏపీ జెన్కో కార్మికులు, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

**పలు సమస్యపై హైడెల్ డైరెక్టర్‌కు సిఐటియు వినతి**

**సీలేరు :** సీలేరులో ఏపీ జెన్కో ఆధ్వర్యంలో నడుస్తున్న భవ్య హెల్త్ క్లినిక్‌లో కాంట్రాక్ట్ కార్మికులకు ఉచితంగా వైద్య సేవలు కల్పించాలని ఎపి జెన్కో హైడెల్ డైరెక్టర్ సుజయ్‌కుమార్‌కు ఎపి ఎలక్ట్రిసిటీ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ బ్రాంచ్ అధ్యక్ష కార్యదర్శులు బి.లక్ష్మణరావు విష్ణు కుమార్ మాట్లాడుతూ సీలేరు జలవిద్యుత్ కేంద్రం పరిధిలో వివిధ విభాగాల్లో 53 మంది కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారని, వీరికి భవ్య ఆసుపత్రిలో ఎటువంటి వైద్య సేవలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చాలీచాలని జీతాలతో పని చేస్తున్న వీరికి కనీసం ఉచిత వైద్య సేవలు కూడా అందకపోవడం దారుణమన్నారు. జీవో నెంబర్ 487 ప్రకారం డ్రైవర్లకు కనీస వేతనం రూ.18000 చెల్లించి ఇతర బెనిఫిట్స్ కల్పించాలన్నారు. అప్పర్ సీలేరు ఓ అండ్ డామ్ డివిజన్లో పనిచేస్తున్న ఆరుగురు పీస్ వర్కర్లుకు నెలకి 26 రోజులు పని దినాలు కల్పించి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని విజ్ఞప్తి చేశారు. మాచ్ ఖండ్, ఒనకఢిల్లీలో పనిచేస్తున్న తొమ్మిది మంది కాంట్రాక్ట్ కార్మికులకు పీస్ రేట్లు రద్దు చేసి 2025- 26 ఎస్టిమేట్లు సవరణ చేసి సమాన పనికి సమాన వేతనం కల్పించాలని, జోలాపుట్ పబ్లిక్ హెల్త్‌లో 14 ఏళ్లగా పనిచేస్తున్న ఇద్దరు కాంట్రాక్ట్ కార్మికులకు మ్యాన్ పవర్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షులు కెవిజి బాపిరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ రమణ, జాయింట్ సెక్రెటరీ జి.లక్ష్మణరావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ ఎస్కెకె అబీబుల్లా, బి లోకేష్, ఎస్కే వల్లి, వనముల రాము, యాదాల రమణ పాల్గొన్నారు.



సుజయ్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న సిఐటియు నేతలు

## 28న మండల పరిషత్తు సమావేశం

**ప్రజాశక్తి-రాజవొమ్మంగి**

రాజవొమ్మంగి మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం ఈనెల 28న స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరుగుతుందని ఎంపీడీవో లోకుల యాదగిరిశ్వరరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటల నుండి జరిగే ఈ సమావేశానికి అందరు ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

## విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు పునాది వేయండి

### - ఐటిడిఏ పిఒ అభిషేక్

**ప్రజాశక్తి-పాడేరు:** గిరిజన విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు పటిష్టమైన పునాదులు వేయాలని ఐటిడిఏ పిఒ వి.అభిషేక్ పేర్కొన్నారు. లోచలిపుట్టు ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో జరిగిన తెలుగు, ఆంగ్లం, హిందీ ఉపాధ్యాయుల రెండు రోజుల పునశ్చరణ తరగతుల ముగింపు కార్యక్రమంలో శనివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సూపర్ 50 శిక్షణ తరగతులను ప్రతి సంవత్సరం కొనసాగించాలని సూచించారు. ప్రతీ తరగతిలోనూ ఆణిముత్యాలాంటి విద్యార్థులు ఉంటారని చెప్పారు. వారిని చూసినప్పుడే సూపర్ 50 తరగతులను నిర్వహించాలని శ్రీకారం చుట్టామన్నారు. బేస్ లైన్ ఎగ్జామ్స్ గుర్తించిన సి.డి. గ్రూపుల విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దవలసిన బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉన్నదన్నారు. విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసాన్ని పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రతీ విద్యార్థి ఉన్నతంగా చదువుకోవాలన్నారు. విద్యార్థులకు కేరీర్ గైడెన్సుపై అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులు గణితంలో వెనుకబడి ఉన్నారని పేర్కొన్నారు. గణితంలో ప్రమాణాలు పెరిగే విధంగా బోధించాలని స్పష్టం చేసారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల విద్యార్థుల్లో కనీసం 30 శాతం ఉత్తమ విద్యార్థులు ఎదగాలన్నారు. గిరిజన సంక్షేమ ఉప సంచాలకులు ఎల్. రజని మాట్లాడుతూ, విద్యాభివృద్ధికి పిఒ కృషి చేసారని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలుగు, ఆంగ్లం, హిందీ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



రగ్గులు పంపిణీ చేస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు

## వృద్ధులకు రగ్గుల పంపిణీ

**ప్రజాశక్తి-పాడేరు:** అల్లూరి సీతారామరాజు జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో పాడేరు మండలం వంటలమామిడి పంచాయతీ ఓనూరు పివిటిజి గ్రామంలో వృద్ధులకు రగ్గులు పంపిణీ చేశారు. శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని మారుమూల పివిటిసి గ్రామంలో రెడ్ క్రాస్ సొసైటీ బృందం నేరుగా వెళ్లి రగ్గులను పంపిణీ చేయడంతో ఆ గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఆరోగ్య సూత్రాలను ప్రజలకు తెలియజేశారు. బాల్యవివాహాలతో దుష్ప్రభావాలపై రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ గంగరాజు, కార్యదర్శి గౌరీ శంకర్ గ్రామ ప్రజలకు వివరించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని ఆదర్శ గ్రామంగా ఓనూరు గ్రామాన్ని తీర్చిదిద్దాలని రెడ్ క్రాస్ సొసైటీ కోశాధికారి సూర్యారావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పేట్రిన్ సభ్యులు బొర్రా నాగరాజు, మేనేజింగ్ కమిటీ సభ్యులు రవి, జిల్లా కోఆర్డినేటర్ లోహితస్, తదితరులు పాల్గొన్నారు.

## పశువైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

**ప్రజాశక్తి -హుకుంపేట:** మండలంలోని పాతకోట పంచాయతీ పాలెం గ్రామంలో పశు ఆరోగ్య శిభిరం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి నరసింహులు పాల్గొన్నారు. రైతులకు అందిస్తున్న సేవలను పశు వైద్యాధికారులను అడిగి తెలుకున్నారు. ఈ సందర్భంగా నరసింహులు మాట్లాడుతూ, పశువులకు వైద్య సేవలు అందించేందుకు రైతులు సహకరించాలని పేర్కొన్నారు.పశువుల ఆరోగ్యంపై ధృష్టి సాధించాలని ఆయన పేర్కొన్నారు. పశువులు జబ్బు పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా 208 పశువులకు, 135 మేకలు, గొర్రెలకు నట్టలు నివారణ మందులు వేశామన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి చరణ్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



టీకాలు వేస్తున్న జిల్లా పశు వైద్యాధికారి నరసింహులు

# పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

### సిఐటియు జిల్లా అధ్యక్షులు చిన్నయ్య పడాల్

**ప్రజాశక్తి-చింతపల్లి:** ఆసుపత్రులలో పారిశుధ్య కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణం పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ డిమాండ్ చేశారు. అల్లూరి జిల్లా పరిధిలోని పాడేరు, అరకు, ముంచంగిపుట్టు, చింతపల్లి ప్రభుత్వ ఆసుపత్రులలో గడచిన 20 ఏళ్లకు పైగా పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు గత వైసిపి ప్రభుత్వం 2019 లో 16 వేల రూపాయలు జీతాలు చెల్లిస్తామని చెప్పి జి.ఓ జారీ చేసిందన్నారు. పారిశుధ్య కార్మికులకు నేటికీ గరిష్ఠంగా 10,200 రూపాయలు మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. నెల తరబడి జీతాలు అందలేదని, పీఎఫ్, ఈఎస్ఐలు కార్మికుల నుండి వసూలు చేసినప్పటికీ సంబంధిత గుత్తేదారుడు (కాంట్రాక్టర్) సొమ్ము సక్రమంగా చెల్లించడం లేదన్నారు. తక్షణమే కాంట్రాక్టు విధానం రద్దు చేసి డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డిఎంఈ) ద్వారా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కొత్త జి.ఓ జారీ చేసి కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో 100 పడకలకు సంబంధించి పారిశుధ్య కార్మికులు కేవలం 20 మంది మాత్రమే పని చేస్తున్నారని, దీంతో, వీరిపై పని భారం అధికమై ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. యూనిఫామ్ సక్రమంగా పంపిణీ చేయాలని, వేతనంతో కూడిన సెలవులు ఇవ్వాలన్నారు.ఎన్డీఎ కూటమి ప్రభుత్వం ఆసుపత్రి పారిశుధ్య కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. వినతి పత్రాన్ని పారిశుధ్య కార్మికులతో కలిసి స్థానిక ఆసుపత్రి సూపరింటెండెంట్ జి ప్రభావతికి ఆయన అందజేశారు.

# విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

### అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

**ప్రజాశక్తి-అరకులోయ రూరల్:**విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అరకు నియోజకవర్గం ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం హెచ్చరించారు.శనివారం అనంతగిరి మండలం టోకురు బాలికల ఆశ్రమ పాఠశాలలో అరకు ఎమ్మెల్యే ఆకస్మికంగా సందర్శించి, రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు చదువు బోధించడంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం అనంతగిరి మండల కేంద్రంలో ప్రభుత్వ బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించి ఆహార నాణ్యతను పరిశీలించారు.మెను ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందిచకపోతే చర్యలు తీసుకుం టామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అనంతగిరి మండల ఎంపీపీ శెట్టి నీలవేణి, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మత్స్యలింగం

# మెరుగైన వైద్య సేవలందించాలి

### జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జమాల్ బాషా



పర్యటిస్తున్న డిఎం అండ్ హెచ్ఒ జమాల్ భాషా

**ప్రజాశక్తి-దుంబ్రిగుడ:**వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటూ గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యశాఖ ఆరోగ్య అధికారి జమాల్ భాష సూచించారు. మండల కేంద్రంలోని పీహెచ్సీని శనివారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పి హెచ్ సి ఓపీను, బర్త్ వైటింగ్ హెూమ్, మందుల గదులను, ల్యాబ్ లను ఆయన పరిశీలించారు. అనంతరం అక్కడి నుంచి ఎఫ్‌పిసి నిర్వహిస్తున్న అరమ సబ్ సెంటర్ మారుమూల ప్రాంతమైన జుర్రిపాడు గ్రామాన్ని సందర్శించి వైద్యం కోసం వచ్చిన గర్భిణీ స్త్రీలను, బాలింతలను పరామర్శించి వారికి అన్ని రకాల రక్త పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటూ గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో వైద్య అధికారి రాంబాబు, అంబిక రమణి, ఎంశౌరి, ఆశ కార్యకర్త పాల్గొన్నారు.

# ఎయును సందర్శించిన సియోరాలియోన్ అంబాసిడర్

**ప్రజాశక్తి-విశాఖపట్నం :** సియెరా లియోన్ దేశ అంబాసిడర్ (యుఎఇ) రషీద్ సిసే ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని శనివారం సందర్శించారు. అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో చదువుతున్న సియెరా లియోన్ విద్యార్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆంధ్ర విశ్వవిద్యాలయంలో చక్కటి వాతావరణం ఉందన్నారు. ఇక్కడ చదువుతున్న తమ దేశ విద్యార్థులు ఉత్తమ విలువలు నేర్చుకుంటున్నారని తెలిపారు.

## నేరాలు ఘోరాలు

### పురుగుల మందు తాగి తల్లీ కూతురు మృతి

**ప్రజాశక్తి -భీమునిపట్నం :** జివిఎంసి రెండో వార్డు పరిధి ఆదర్శనగర్ గొల్లవీధిలో ఉంటున్న మహంతి మాధవి (25) పురుగుల మందు తాగి ఆత్మ హత్యకు పాల్పడడమే గాకుండా తన ఐదేళ్ల కుమార్తె ఇషిత, 18 నెలల కుమార్తె రితిక్షకు కూడా పురుగుల మందు తాగించింది. ఈ ఘటనలో తల్లి మాధవి, చిన్న కుమార్తె రితిక్ష మృతి చెందారు. పెద్ద కుమార్తె ఇషిత అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. స్థానికులను కలచి వేసే ఈ ఘటనకు సంబంధించి సిఐ సుధాకర్ కథనం ప్రకారం... శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలం, మదనాపురానికి చెందిన మహంతి మాధవి (25)కి రామకృష్ణతో 2019 మార్చి 23న పెద్దల సమక్షంలో పెళ్లైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఇషిత (5), రితిక్ష (18 నెలలు) ఉన్నారు. మృతురాలు మాధవి భర్త చిప్పాడ దివీస్‌లో ఉద్యోగిగా పనిచేస్తున్నారు. ఈ నెల 24వ తేదీ మధ్యాహ్నం 1 గంట సమయంలో తల తిరుగుతుందని సొంతూరు శ్రీకాకుళంలో ఉన్న తండ్రి బాణాల గణపతిరావుకు మాధవి ఫోన్ చేసింది. మధ్యలో ఫోన్ వాయిస్ బ్రేకవ్వడంతో అనుమానం వచ్చిన తండ్రి కుటుంబ సభ్యులను తగరపువలసలో ఉంటున్న కుమార్తె ఇంటికి పంపించారు. అప్పటికే తల్లి, ఇద్దరు కుమార్తెలు అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. వీరిని చికిత్స నిమిత్తం స్థానిక సంగివలస అనిల్ నీరుకొండ ఆసుపత్రికి తీసుకెళ్లగా శనివారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో మాధవి, అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇద్దరు కుమార్తెల్లో చిన్న కుమార్తె 18 నెలల రితిక్ష మధ్యాహ్నం 3 గంటలకు మృతి చెందారు. పెద్ద కుమార్తె చికిత్స పొందుతోంది. భార్యాభర్తల మధ్య కాపురం సవ్యంగానే ఉండేదని, ఈ నెల 24వ తేదీన భార్యాభర్తల మధ్య జరిగిన చిన్నపాటి గొడవతో ఈ దారుణం జరిగినట్లు భావిస్తున్నట్లు మృతురాలు మాధవి తండ్రి గణపతిరావు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎస్ఐ జి.హరీష్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

### 6 కిలోల గంజాయి స్వాధీనం

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** విశాఖ రైల్వే స్టేషన్‌లోని ప్లాట్ ఫారం -1కు సమీపంలో గంజాయితో ప్రకాశం జిల్లా ఒంగోలుకు చెందిన షేక్ సాహుల్, మోట నవీన్ పట్టుబడ్డారు. జిఆర్‌పి ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయ నాయుడు ఆధ్వర్యంలో సబ్ ఇన్‌స్పెక్టర్ కె.శాంతారామ్, ఆర్‌పిఎఫ్ ఎఎస్ఐ ఎస్.చిట్టిబాబు సిబ్బందితో రైల్వే స్టేషన్‌లో ఎప్పటిలాగే శనివారం తనిఖీలు నిర్వహిస్తుండగా నిందితులు చిక్కారు. వారి నుంచి రూ.30 వేల విలువగల 6 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

### హనీ ట్రాప్ కేసులో ఏడుగురు అరెస్టు

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** భీమిలి పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ నెల 18న జరిగిన హనీ ట్రాప్ దోపిడీ కేసులో ఏడుగురు నిందితులను అరెస్ట్ చేశామని, వారిలో ఓ మహిళ కూడా ఉందని విశాఖపట్నం క్రైమ్ డిసిపి కె.లతా మాధురి తెలిపారు. శనివారం సాయంత్రం పోలీస్ కమిషనర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేసు వివరాలను ఆమె వెల్లడించారు. శ్రీకాకుళం జిల్లా పాతపట్నంకు చెందిన బాధితుడు తనకు వచ్చిన ఫోన్ కాల్ ఆధారంగా భీమిలి సమీపంలోని ఒక ప్రాంతానికి వెళ్లాడు. అక్కడకు చేరుకున్న ఆరుగురు నిందితులు అతన్ని బెదిరించారు. రూ.50 వేల నగదు, ఫోన్‌ను లాక్కున్నారు. అకౌంట్‌లోని సొమ్మునూ కాజేశారు. బాధితున్ని తీవ్రంగా కొట్టి వెళ్లిపోవడంతో అతడు భీమిలి పోలీసులను ఆశ్రయించాడు. సాంకేతిక ఆధారాలతో కేసును ఛేదించారు. రూ.58,900 నగదు, సెల్‌ఫోన్‌ను నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్నారు. శనివారం కోర్టులో వారిని హాజరుపరచగా న్యాయస్థానం రిమాండ్ విధించింది. ఈ కేసులో అరెస్టు అయిన ఏడుగురు నిందితులలో నలుగురిపై ఇప్పటికే పలు కేసులు ఉన్నాయని లతా మాధురి తెలిపారు.

### గ్రావెల్ ట్రాక్టర్ సీజ్

**ప్రజాశక్తి -నక్కపల్లి:** మండలంలోని రాజయ్యపేట సమీపంలో అక్రమంగా గ్రావెల్ రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ సన్నిబాబు తెలిపారు. ఎటువంటి అనుమతులు లేకుండా శనివారం సాయంత్రం గ్రావెల్ తవ్వకాలు చేపట్టి ట్రాక్టర్‌లో రవాణా చేస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి, కేసు నమోదు చేశామన్నారు.

## పైపులైన్ వేసి ప్రజలకు తాగునీరు అందించాలి

**ప్రజాశక్తి-విఆర్.పురం :** జల్ జీవన్ మిషన్ ద్వారా నిర్మించిన వాటికి తక్షణమే పైపులైన్లు వేసి ప్రజలకు తాగునీరు అందించాలని సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కమిటీ సభ్యులు సోయం చిన్నబాబు డిమాండ్ చేశారు. మండలంలోని ములకనపల్లి పంచాయతీ పరిధి ముల్కనపల్లి, గొల్లగూడెం గ్రామాల్లో శనివారం పండ గోపాల్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చిన్నబాబు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నా గిరిజనులకు తాగునీరు అందించలేకపోవడం శోచనీయమన్నారు. జల్ జీవన్ మిషన్ ద్వారా బోర్లు వేసి, పైపులైన్లు వేయకపోవడంతో ప్రజలకు తాగునీరు అందని దుస్థితి నెలకొందన్నారు. దీనిపై అధికారులను అడిగితే బెడ్డింగ్ తాగునీరు అందిస్తామని, అందుకే జల్ జీవన్ పథకం నిలిపివేశారని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. బెడ్డింగ్ తాగునీరు అందించాలంటే చాలా సంవత్సరాలు పడుతుందని, అంతవరకు ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అధికారులు స్పందించి తక్షణమే బోరు దించిన వాటికి పైపులైన్లు ఇచ్చి ప్రతి ఇంటికి తాగునీరు అందించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు కె.సత్యనారాయణ, సర్పంచ్ సవలం మారయ్య, శాఖ కార్యదర్శి బంగారు ప్రసాద్, సవలం కన్నయ్య, నూనె దేసయ్య, నూనె నాగేశ్వరరావు, ప్రభాకర్, కన్నయ్య, రాములు, కారం రమేష్, కారం రత్తయ్య, వను, సీసం సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధం

**ప్రజాశక్తి-దేవీపట్నం :** దేవీపట్నం మండలం చిన్నారి గండి గ్రామంలో శనివారం జరిగిన అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన కుంజం సత్యనారాయణ దొర ఇంట్లో వంట చేసిన తరువాత ఉండిపోయిన అగ్గి రవ్వలు కారణంగా మంటలు ఎగిసిపడ్డాయి. ఆ ఇంట్లో ఐదు గ్యాస్ సిలిండర్లు ఉండడంతో ప్రజలు భయ భ్రాంతులయ్యారు. గ్రామంలో ఉన్న యువకులు, పెద్దలు కలిసి ధైర్యంగా మంటలను అదుపు చేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. సిలిండర్లు ఏమాత్రం పేలినా భారీ నష్టం సంభవించి ఉండేది. అగ్ని ప్రమాదం జరిగిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది. అగ్నికి ఇంట్లో ఉన్న వస్తువులన్నీ కాలి బూడిదయ్యాయి. సర్వం కోల్పోయిన బాధితులను ప్రభుత్వం ఆదుకోవాల్సి ఉంది. అగ్ని ప్రమాద విషయం తెలుసుకున్న దేవీపట్నం తాహశీల్దార్ సత్యనారాయణ వెంటనే సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ప్రమాదం జరగడానికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. బాధితులకు బియ్యం, పంచదార, కందిపప్పుతో పాటు నిత్యవసర వస్తువులు పంపిణీ చేశారు. ఇల్లు కోల్పోయిన బాధితులకు కొత్త ఇల్లు నిర్మించే విధంగా ప్రభుత్వ పరంగా సహాయం చేయాలని గ్రామస్తులు కోరారు.

## బాలికల సంరక్షణ బాధ్యత ప్రభుత్వానిదే..

**ప్రజాశక్తి - ఆరిలోవ :** రాష్ట్రంలో బాలికల సంరక్షణ బాధ్యత ప్రభుత్వానిదేనని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. విశాఖ వ్యాలీ స్కూలు వద్ద ఉన్న ప్రభుత్వ ప్రత్యేక బాలికల గృహాన్ని ఆమె శనివారం ఉదయం సందర్శించారు. మూడు రోజులుగా అక్కడ జరుగుతున్న పరిణామాల దృష్ట్యా హోం మంత్రి పర్యటన ప్రాధాన్యతను సంతరించుకుంది. తొలుత ఆమె గృహాన్ని సందర్శించి అక్కడ నెలకొన్న పరిస్థితులను తెలుసుకున్నారు. బాలికలతో మాట్లాడారు. మూడు రోజులపాటు తమను ఇంటికి పంపించేయాలని బాలికలు చేసిన ఆందోళనను, అందుకు దారితీసిన పరిస్థితులను గృహ పర్యవేక్షణాధికారి సునీతను, సిబ్బందిని, అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ బాలికల ఆందోళన విషయం తెలియగానే జిల్లా కలెక్టర్, తహశీల్దారు, పోలీసు అధికారులతో మాట్లాడి పరిస్థితిని తెలుసుకొని పరిష్కారానికి ప్రయత్నించాలని సూచించినట్టు తెలిపారు. బాలికల సమస్యను పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో పనిచేయాలే తప్ప రాజకీయం చేసి కూటమి ప్రభుత్వాన్ని టార్గెట్ చేసి మాట్లాడటం వైసిపికి తగదన్నారు. ఇక్కడ జరిగినది చాలా సున్నితమైన విషయమన్నారు. ఇక్కడ ఉంటున్న బాలికలు వేర్వేరు ప్రాంతాల నుంచి, వేర్వేరు సమస్యలు, వారి వారి కుటుంబ నేపథ్యాలు బాగాలేక వచ్చినవారేనన్నారు. వారిలో కొంతమంది లైంగిక దాడులకు గురై డిప్రెషన్‌లో ఉంటారన్నారు. వారి సమస్యను గుర్తించి వెంటనే చైల్డ్ వెల్ఫేర్ కమిటీ నిర్ణయం మేరకు కొంత మందిని ఇంటికి పంపించామని, మరి కొంతమందిని వేరే హోంకు తరలించామని అన్నారు. మరొక బాలిక విషయం కోర్టు పరిధిలో ఉండటం వల్ల వెంటనే పంపలేకపోతున్నామని తెలిపారు. ఈ విషయంపై వైసిపి రాజకీయం చేసి లబ్ధిపొందాలనుకోవడం మానుకోవాలని హితవు పలికారు. బాలికల సంరక్షణ బాధ్యత ప్రభుత్వమే తీసుకుంటుందన్నారు. ఈ విషయం ఎవరూ గుర్తు చేయల్సిన అవసరం లేదన్నారు. ఇప్పుడు సమస్య పరిష్కారమైందని, భవిష్యత్తులో ఇటువంటి సమస్యలు తలెత్తకూడదనే గృహాన్ని సందర్శించానని తెలిపారు. గత ఐదేళ్లు వైసిపి అబద్ధాలతోనే గడిపేసిందన్నారు. ఇప్పుడూ అదే రీతిన ప్రజలను మభ్యపెట్టాలని చూస్తోందన్నారు.

# ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం




పాడేరులో పాల్గొన్న జెసి అభిషేక్ గౌడ్, తదితరులు

**ప్రజాశక్తి-అల్లూరి జిల్లా**

జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా అల్లూరి జిల్లా చింతూరు ఐటిడిఎ కార్యాలయం నుండి సెంటర్ వరకు తహసీల్దార్ యస్.చిరంజీవి బాబు ఆధ్వర్యంలో ప్లకార్డులు పట్టుకొని ర్యాలీ నిర్వహించారు. పెద్ద పెట్టున నినాదాలు చేశారు. సెంటర్‌లో మానవహారం నిర్వహించి ఓటర్ల ప్రతిజ్ఞ చేశారు. ముందుగా చింతూరు ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి అపూర్వ భరత్ పచ్చ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కును కలిగి ఉండాలని, ఎన్నికల సమయంలో ఎటువంటి ప్రలోభాలకు లోను కాకుండా నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.అంబేద్కర్, రెవెన్యూ కార్యాలయ సిబ్బంది విఘ్నేష్, మల్లు దొర, రామచంద్ర, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ షేక్ నాగూర్ మీరా, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్నమాణిక్యం, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం ఐటిడిఎ సెమినార్ హాల్లో నిర్వహించిన అవగాహన సదస్సులో ఓటు హక్కు వినియోగంపై వక్తలు అవగాహన కల్పించారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ పోటీల విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఇద్దరు సీనియర్ ఓటర్లను సన్మానించారు.

**రాజవొమ్మంగి :** ఓటు హక్కు చాలా విలువైనదని ఓటు హక్కును ప్రతి పౌరుడు తప్పనిసరిగా సక్రమంగా వినియోగించుకోవాలని స్థానిక తాహశీల్దార్ అల్లు సత్యనారాయణ, ఎంపీడీవో లోకుల యాదగిరిశ్వరరావు అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శనివారం ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు రాజవొమ్మంగిలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం చేపట్టి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గొల్లపూడి పెద్దిరాజు, హెచ్ఎం గోపాలకృష్ణ, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**దేవీపట్నం :** మండలంలోని ఇందుకూరుపేట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధికారులు మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును పౌరులు బాధ్యతగా వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

**సీలేరు :** జీకే మండలం సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డి.శ్రీను, ప్రిన్సిపాల్ వి.శంకర్రావు ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. జూనియర్ కళాశాల నుంచి ర్యాలీగా బయలుదేరి నోటు వద్దు ఓటు ముద్దు అంటూ నినాదాలు చేస్తూ సీలేరు మార్కెట్ సెంటర్‌కు చేరుకుని అక్కడ మానవహారం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు. సీలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బిఎల్ఓ ఆధ్వర్యంలో జాతీయ వాటర్ దినోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా చిన్నారులకు ముగ్గులు పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి ఎంపీటీసీ పిల్ల సాంబ మూర్తి, సర్పంచి దుర్గో, ఉప సర్పంచ్ కే. వల్లి ప్రసాద్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నక్క తులసీనాధరావు, వార్డు మెంబర్ చిటికెల రాము, బాలు గోవిందు, మహిళా పోలీస్ రేవతి, యానిమల్ అసిస్టెంట్ అనుష్క, ఉపాధ్యాయులు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.




రాజవొమ్మంగిలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు

**పాడేరు:** ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రాముఖ్యత విలువలపై పౌరులు అవగాహన ఉండాలని జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ్ సూచించారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా శనివారం ఓటు హక్కుపై అవగాహనా ర్యాలీని నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ కూడలి వద్ద మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, 18 ఏళ్లు నిండిన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. గత ఎన్నికలలో 70 శాతం ఓటు హక్కును వినియోగించుకున్నారని చెప్పారు. ఐటిడిఏ పి.ఓ. వి.అభిషేక్ మాట్లాడుతూ ప్రజా స్వామ్యానికి పునాది ఓటు హక్కని చెప్పారు. ఎక్కువ మందిని ఓటరుగా నమోదు చేయడానికి చర్యలు చేపట్టామన్నారు. మృతి చెందిన ఓటర్లను ఓటరు జాబితా నుండి తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, డి.ఆర్.ఓ. కె.పద్మలత, జిసిసి డైరెక్టర్ బొర్రా నాగరాజు, డిగ్రీ కళాశాల లెక్చరర్ గౌరీ శంకర్ పాడేరు తహశీల్దార్ వంజంగి త్రినాధరావు నాయుడు, కలెక్టరేట్ సూపరిండెంట్ తిరుమలరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు...

**హుకుంపేట:**మండల కేంద్రంలోని సంతలో జాతీయ ఓటు హక్కు దినోత్సవం సందర్భంగా అవగాహన కల్పించారు. అనంతరం డిప్యూటీ తహసిల్దార్ కృష్ణారావు మాట్లాడుతూ, 18 సంవత్సరాలు నిండిన పౌరులందరూ ఓటు హక్కు పొందుకోవాలన్నారు.స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కొమ్మరమ్మ, ఆర్ఐ సీతమ్మ, వీఆర్వో రత్న కుమారి. సిబ్బంది పాల్గొన్నారు.

**ముంచింగిపుట్టు:**మండల కేంద్రంలో తహసీల్దార్ నర్సమ్మ ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. వారపు సంతలో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా తహసిల్దార్ నర్సమ్మ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన యువత ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రీ సర్వేయర్ డిటి భూపతిరాజు, సీనియర్ అసిస్టెంట్ కామరాజు, వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

**చింతపల్లి**: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటర్ గా నమోదు చేసుకోవాలని మండల డిప్యూటీ తహసిల్దార్ చంద్రశేఖర్ సూచించారు. మండల కేంద్రంలో ఓటర్ల అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, సచివాలయ సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.



సాయం అందజేస్తున్న నాయకులు

## అగ్ని ప్రమాద బాధితునికి సాయం

**ప్రజాశక్తి-కూనవరం :** మండలంలోని వెంకటాయపాలెం గ్రామానికి చెందిన అగ్ని ప్రమాద బాధితుడు బల్లెం రమణయ్యకు జనసేన పార్టీ ఆర్థిక సాయం అందజేసింది. శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో రమణయ్య పూర్తిగా ఇల్లు దగ్ధమై దాదాపు రూ.3 లక్షల పైబడి ఆస్తి నష్టం సంభవించింది. పిల్లలు ఒరిజినల్ స్టడీ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డులు కాలిపోయి సర్వం కోల్పోయారు. విషయం తెలుసుకున్న జనసేన పార్టీ మండల కమిటీ నాయకులు ఉరూ.12,500 నగదు, బియ్యం, పప్పు, కూరగాయలు, ఇతర నిత్యావసరాలు శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కూనవరం సర్పంచ్ హేమంత్, జనసేన పార్టీ మండల అధ్యక్షులు దాసరి నరేంద్ర కుమార్, ఉపాధ్యక్షులు బద్రి, టౌన్ అధ్యక్షులు యాలం శ్రీకాంత్, కుచ్చలపాటి వాసు, శ్రీరామ్, పవన్, విజయ్, బాబీ, సాయి, రాంబాబు, వీరబాబు, చిన్ని, దుర్గా, ప్రేంసాగర్ అశోక్, సంతోష్, నోముల అప్పన్న, బల్లెం సుధాకర్, వంశీ, కుచ్చలపాటి రాంకీ, రాము, క్రాంతి కుమార్, వెంకట్, ప్రశాంత్, సాయికుమార్, బాలు, కౌశిక్, మణి కుమార్, లక్ష్మణ్, సాహిత్, మోహన్, నందు తదితరులు ఉన్నారు.

## లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు

**ప్రజాశక్తి-రంపచోడవరం :** డెలివరీ ముందు లింగ నిర్ధారణ ఎవరైనా వైద్యాధికారులు, ప్రైవేట్ ఆస్పత్రుల్లో చేస్తే చట్టపరంగా శిక్షారులవుతారని రంపచోడవరం సబ్ కలెక్టర్ కెఆర్.కల్పశ్రీ అన్నారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో లింగ నిర్ధారణ నిర్మూలన కమిటీ సభ్యులు, ఎడిఎంహెచ్ఒ, ఎన్జీవోలతో సబ్ కలెక్టర్ శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూతురు అంటే ఒక ఆణిముత్యమని పేర్కొన్నారు. ఏజెన్సీలో బాల్య వివాహాలు నిర్మూలించే బాధ్యత మనందరిపై ఉందని చెప్పారు. మహిళలు పిల్లలు పుట్టిన వెంటనే మళ్లీ గర్భం దాల్చకుండా రెండు సంవత్సరాల దాటిన తర్వాత గర్భం దాల్చే విధంగా అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ప్రభుత్వ ఆసుపత్రిలో నిబంధన ప్రకారం సమావేశాలు ఎప్పుడు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి మెడికల్ షాపులో ఏ మందులు అమ్ముతున్నదీ, లైసెన్సులు ఉన్నదీ లేనిది పరిశీలించి నివేదిక సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఏజెన్సీలో బాలికలు టీనేజీ గర్భాలు దాల్చకుండా ఎక్కడికక్కడ అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రతి గ్రామంలో వివిధ వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. ఏజెన్సీలోని బాలికలకు డ్రాయింగ్ వేసే కార్యక్రమాన్ని ప్రతి స్కూల్లో చేపట్టాలని, దీని గురించి బడి బయట ఉన్న పిల్లల కూడా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లింగ నిర్ధారణ నిర్మూలన కమిటీ కన్వీనర్ జి. శిరీష, వైద్యాధికారులు మోమీనా, ఆదిలక్ష్మి, ఎంపీహెచ్ఓ పీటర్, హెల్త్ ఎడ్యుకేటర్ ఝాన్సీ, సబ్ ఇన్స్పెక్టర్ భూషణం, ఎన్జీవో సంగీత, ఎన్జీవో రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## విష్ణు కెమికల్‌లో కార్మికుడు మృతి

**ప్రజాశక్తి - పరవాడ, విశాఖ కలెక్టరేట్ :** అనకాపల్లి జిల్లా పరవాడ రాంకీ ఫార్మా సిటీలో విష్ణు కెమికల్ పరిశ్రమలో శనివారం కన్వేయర్ బెల్టులో పడి ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన కాంట్రాక్ట్ కార్మికుడు రాజ్ వీర్ (20) మృతిచెందాడు. ఆయన మృతిపై సమగ్ర విచారణ చేయాలని ఫార్మా సిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. శనివారం ఆయన కెజిహెచ్ మార్చురీ వద్ద రాజ్‌వీర్ మృతదేహాన్ని సందర్శించారు. కుటుంబీకులను పరామర్శించారు. పరిశ్రమల్లో వరుస ప్రమాదాలతో కార్మికులు భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు. మృతుని కుటుంబానికి రూ.కోటి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.